ప్రజాశక్తి

శనివారం 24 ఫిబ్రవరి 2024 5 అనంతపురం

గ్రూప్-2 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు చేపట్టండి

జిల్లాలో 111 పరీక్ష కేంద్రాలు : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.గౌతమి

ప్రభుత్వం ఈనెల 25వ తేదీన అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న గ్రూప్- 2 పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఎం.గౌతమి అధికారులను ఆదేశించారు. శుక్రవారం నాడు అనంతపురం కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఈనెల 25వ తేదీన నిర్వహించనున్న ఏపీపీఎస్సీ, గ్రూప్- 2 పరీక్షలపై రూట్ ఆఫీసర్లు, లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీన ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్–2 సర్వీసెస్ కింద (స్క్రీనింగ్ టెస్ట్)ఆబ్జెక్టివ్ పరీక్షలను నిర్వహిస్తోందన్నారు. ఆదివారం ఉదయం 10:30 గంటల నుంచి 01:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఇందుకు సంబంధించి 32,391 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. జిల్లాలో 111 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇందుకోసం అవసరమైన సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించినట్లు తెలియజేశారు. ఎక్కడా చిన్న తప్పు జరగకుండా పరీక్షలను నిర్వహించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. మాల్‌ప్రాక్టీస్ జరగకుండా ఇన్విజిలేటర్స్ పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉదయం 9:30గంII లకు అభ్యర్థులు వారికి కేటాయించిన పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు వారి వెంట హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు. పరీక్ష సమయం పూర్తయిన తర్వాతనే బయటకు పంపించాలన్నారు. ఈ సమావేశంలో ఏపీపీఎస్సీ డిప్యూటీ సెక్రెటరీ (మానిటర్) డి.అపరంజని, సెక్షన్ ఆఫీసర్లు పివి.నవజ్యోతి, జె.యశోద, డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి, అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ రెడ్డి, సిపిఒ అశోక్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదన్ రావు, మెప్మా పీడీ విజయలక్ష్మితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాడిపత్రిలో త్రిముఖపోరు..?!

తాడిపత్రి... రాష్ట్రంలోనే ప్రత్యేకత కలిగిన నియోజకవర్గం. ఇక్కడ ఏ రాజకీయ పరిణామం జరిగినా అది ఒక సంచలనంగానే ఉంటుంది. ఇక్కడున్న నేతలు.. ఇక్కడ జరిగే పరిణామాలు అన్నీ కూడా గరంగరంగా ఉంటాయి. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇవి మరింత ఎక్కువగా కన్పిస్తుంటాయి. ఈ సారి జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో సైతం ఇదే రాజకీయవేడి కన్పించే పరిస్థితులు కన్పిస్తున్నాయి. పోటీలో పాతకాపులకు తోడు కొత్తగా కాంగ్రెస్ నుంచి బలమైన అభ్యర్థి పోటీలో ఉంటారన్న ప్రచారంతో త్రిముఖ పోరు ఉండే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

కేతిరెడ్డి పెద్దారెడ్డి

జెసి.అస్మిత్‌రెడ్డి

పేరం నాగిరెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రి నియోజకవర్గం అనగానే జెసి కంచుకోటగా గుర్తింపు ఉంది. 40 సంవత్సరాలుగా జెసి కుటుంబం ఇక్కడి నుంచి ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించారు. 2019 సంవత్సరంలో జరిగిన ఎన్నికలలో అనూహ్యంగా జెసి కుటుంబానికి ఓటమి ఎదురైంది. వైసిపి అభ్యర్థిగా పోటీ చేసిన కేతిరెడ్డి పెద్దారెడ్డి జెసి.ప్రభాకర్‌రెడ్డి కుమారుడు జెసి.అస్మిత్‌రెడ్డిపై విజయం సాధించారు. అనంతరం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో తాడిపత్రిలో మెజార్టీ టిడిపి కౌన్సిలర్లను గెలిపించుకుని ప్రభాకర్‌రెడ్డి తన పట్టును నిలుపుకున్నారు.

2019లో కేతిరెడ్డి పెద్దారెడ్డి సంచలన విజయం

ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి 2019 సార్వత్రిక ఎన్నికల్లో జగన్ ప్రభంజనంలో జెసి కుటుంబాన్ని ఓడించి ఎమ్మెల్యేగా గెలుపొందారు. జెసి కుటుంబంపై కేతిరెడ్డి సాధించిన విజయం సంచలనంగా నిలిచింది. పెద్దారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వస్తున్నారు. ప్రభుత్వ పథకాలను అందించడంతో పాటు, సీఎం రిలీఫ్ ఫండ్ తదితర సాయాన్ని అందిస్తూ ప్రజలకు చేరువ అయ్యారు. రైతులకు సాగునీరు అందించడానికి గట్టి ప్రయత్నాలు చేసి సఫలీకృతుడు అయ్యారు. పట్టణ ఆరోగ్య కేంద్రం, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, ఎంవిఐ కార్యాలయం, 100 పడకల ఆసుపత్రి, గ్రామీణ పార్క్, బైపాస్ రోడ్డు పునరుద్ధరణ తదితర అభివృద్ధి పనులను చేశారు. కాగా ఈయన అక్రమ ఇసుక రవాణా చేయించారని, పురపాలక అభివద్ధికి అడ్డుపడుతూ తాగునీటికి, పారిశుధ్యానికి, అండర్ డ్రైయినేజీ నిర్వహణకు అడ్డుపడ్డారని, డీజిల్ దుర్వినియోగం చేశారని ప్రతిపక్షం నుంచి విమర్శలు ఉన్నాయి.

తాడిపత్రిపై జెసి కుటుంబానికి పట్టు

జెసి కుటుంబానికి 1983 నుంచి తాడిపత్రి నియోజకవర్గంతో విడదీయరాని సంబంధం ఉంది. నియోజకవర్గం, తాడిపత్రి పురపాలక సంఘం అభివద్ధిలో వీరి పాత్ర ఎక్కువగా ఉందనే చెప్పాలి. పట్టణ సుందరీకరణ, పారిశుధ్యం నిర్వహణలో దేశంలో తాడిపత్రి మున్సిపాల్టీ గుర్తింపు పొందడంలో జెసి.ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అత్యధిక సౌకర్యాలతో మున్సిపల్ కార్యాలయం, దినసరి కూరగాయల మార్కెట్, పట్టణ పోలీస్ స్టేషన్, పట్టణంలో అండర్ డ్రెయినేజీ రోడ్ల విస్తరణ, సిసి రోడ్ల నిర్మాణం, ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, జూనియర్ కాలేజీ భవన నిర్మాణం, మార్కెట్ యార్డు, మండల కేంద్రాల్లో కమ్యూనిటీ ఫంక్షన్ హాల్ ఏర్పాటు, చాగల్లు పెండేకల్లు డ్యాముల నిర్మాణం, ఆటోనగర్ ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు జెసి సోదరుల హయాంలో జరిగాయి. 2019 ఎన్నికల్లో వీరు ఓటమి పాలైనా, ఈసారి జరిగే ఎన్నికల్లో గెలిచి పూర్వపు వైభవం సాధించడానికి అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. 2024 సంవత్సరం ఎన్నికలే లక్ష్యంగా జేసీ.ప్రభాకర్ రెడ్డి నియోజవకర్గంలోని అన్ని మండలాల్లో బస్సుయాత్ర చేపట్టారు. ఆయా గ్రామాల ప్రజలతో మమేకమై సమస్యలు తెలుసుకుంటూ మద్దతు కూడగడుతున్నారు. ఇక జెసి.దివాకర్ రెడ్డి ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటున్నా, అప్పుడప్పుడు గ్రామాల్లో పర్యటిస్తూ తన సొంత అనుచరులను పలకరిస్తూ మద్దతు కూడగడుతున్నారు. ఆయన తనయుడు జెసి.పవన్ కుమార్ రెడ్డి నియోజకవర్గంలో తిరగకపోవడం, కుటుంబంలో పోటీ చేసే విషయంలో సఖ్యత కొరవడిందననే విషయాలు ప్రతికూల అంశాలుగా ఉన్నాయి.

పేరం పోటీలో ఉంటే త్రిముఖపోరు..?!

రాష్ట్రంలో ఇటీవల కాంగ్రెస్ పార్టీ తన బలాన్ని పెంచుకోవడానికి అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా ఎన్నికల్లో బలమైన అభ్యర్థులను బరిలో దింపడానికి సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో తాడిపత్రిలో సీనియర్ నాయకుడు పేరం నాగిరెడ్డిని ఆ పార్టీ ఆహ్వానించి అభ్యర్థిగా పోటీలో నిలబడితే ప్రయోజనం ఉంటుందనే చర్చ కన్పిస్తోంది. ఇదే విషయాన్ని కొందరు కాంగ్రెస్ నేతలు ఆ పార్టీ ముఖ్య నాయకుల వద్ద చర్చించినట్లు తెలుస్తోంది. పేరం నాగిరెడ్డి నాలుగు సార్లు తెలుగుదేశం పార్టీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఒక సారి తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్‌గా పని చేశారు. 2014 సార్వత్రిక ఎన్నికల ముందు వైసీపీలో చేరి ఆ పార్టీ ఎమ్మెల్యే టికెట్ ఆశించారు. టికెట్టు రాకపోవడంతో అప్పటి నుంచి ఆయన కాస్త రాజకీయాలకు దూరంగా ఉన్నారు. తాడిపత్రి నియోజకవర్గంలో పేరంకు బలమైన అభిమానులు, అనుచర వర్గం ఉన్నాయి. కాంగ్రెస్ నుంచి పేరం నాగిరెడ్డి పోటీ అనివార్యమైతే తాడిపత్రిలో ముగ్గురు బలమైన నేతలు పోటీలో ఉన్నట్లు అవుతుంది. అప్పుడు గెలుపోటముల సమీకరణాలు కూడా మారే అవకాశం ఉంది. అయితే వచ్చే ఎన్నికల్లో పోటీపై పేరం నాగిరెడ్డి ఆయన కుటుంబ సభ్యులు ఇప్పటి వరకు ఎలాంటి రాజకీయ ప్రకటనా చేయలేదు. రాజకీయంగా ఆయన మౌనంగానే ఉన్నారు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీతో చర్చలు ఫలించి పేరం నాగిరెడ్డి కాంగ్రెస్ వైపు మొగ్గు చూపితే తాడిపత్రిలో త్రిముఖ పోటీ తప్పదనే భావన రాజకీయవర్గాల్లో వ్యక్తం అవుతోంది.

◆ కాంగ్రెస్ నుంచి పేరం నాగిరెడ్డి పోటీ చేస్తారనే ప్రచారం..?

◆ మరోమారు తలపడనున్న జెసి.అస్మిత్‌రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి

◆ పేరం పోటీలో నిలిస్తే గెలుపోటములపై ప్రభావం

ఎస్ఐ ఉద్యోగాలు సాధించిన వారికి సన్మానం

ఎస్ఐ ఉద్యోగాలు సాధించిన కానిస్టేబుళ్లను అభినందిస్తున్న ఎస్పీ అన్బురాజన్

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లలో కానిస్టేబుళ్లుగా పని చేస్తూ ఎస్ఐ ఉద్యోగాలు సాధించిన నలుగురు పోలీసులు రిలీవ్ అయ్యారు. ఎస్ఐ శిక్షణ కోసం వెళ్తున్న వీరిని ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్ శుక్రవారం సన్మానించారు. వీరంతా 2018 బ్యాచ్‌కు చెందిన వారు. బుక్కరాయ సముద్రం మండలం రేగడి కొత్తూరుకు చెందిన వి.మణికంఠేశ్వరరెడ్డి ప్రస్తుతం జిల్లా పోలీస్ సైబర్ విభాగంలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. కర్నూలు జిల్లా రామాపురానికి చెందిన జి.సూర్యనారాయణ రెడ్డి జిల్లాలోని గుమ్మఘట్ట పోలీసు స్టేషన్లో, పెద్దపప్పూరు మండలం యక్కలూరుకు చెందిన పి.శ్రావణి గుత్తి పోలీసు స్టేషన్లో, శింగనమల మండలం నాగులగుడ్డం తండాకు చెందిన వెంకట లక్ష్మి అనంతపురం నాల్గవ పట్టణ పోలీసు స్టేషన్లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. వీరంతా ఇటీవల జరిగిన ఎస్ఐ ఉద్యోగాల నియామకంలో ఉద్యోగాలు సాధించారు. ఉద్యోగ శిక్షణ కోసం వీరంతా జిల్లాలో చేస్తున్న విధుల నుంచి రిలీవ్ అయ్యారు. వీరందర్నీ ఎస్పీ సన్మానం చేసి మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ సిఐ జాకీర్ హుస్సేన్, సైబర్ విభాగం సిఐ షేక్ జాకీర్‌లు ఉన్నారు.

ఉపాధ్యాయునిపై చర్యలు

ప్రజాశక్తి-అనంతపురంసిటీ

డి.హీరేహాల్ జడ్పీ హైస్కూల్‌లో టీచర్ విజయభారతి గత శనివారం పదో తరగతి విద్యార్థి జగన్ తలపై ప్యాడ్‌తో కొట్టడంతో అతడికి మూడు కుట్లు పడ్డాయి. దీనిపై స్పందించిన డిఇఒ విచారణ కు గుత్తి డిప్యూటీ డిఇఒను నియమించారు. ఆయన గత సోమవారం పాఠశాలకు వెళ్లి విచారణ చేసి డిఇఒకు నివేదిక అందజేశారు. నివేదిక మేరకు సదరు టీచర్ విద్యార్థిని కొట్టినట్లు స్వయంగా ఒప్పుకోవడంతో ఆ టీచర్‌పై ఆర్టికల్ ఆఫ్ ఛార్జెస్ ఫ్రేమ్ చేశామని, హెచ్ఎంకు షోకాజ్ నోటీసు జారీ చేశామని డిఇఒ బి.వరలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

కూతలేరు బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకం వద్ద గుమిగూడిన జనం

కూతలేరు బ్రిడ్జి వద్ద ఉత్కంఠ

శిలాఫలకంలో పేర్లు లేకపోవడంపై అసంతృప్తి

ప్రజాశక్తి-నార్పల

నార్పలలో కూతలేరు వంతెనపై పూర్తయిన బ్రిడ్జిని శనివారం ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రారంభించనున్నారు. అందుకు సంబంధించి స్థానిక మండల అధికారులు అక్కడ శిలాఫలకం ఏర్పాటుకు దిమ్మెను సిద్ధం చేస్తున్నారు. ఇంతలోనే సామాజిక మధ్యమాల్లో ఆహ్వాన పత్రిక హల్‌చల్ చేసింది. అందులో స్థానిక నాయకుల పేర్లు లేవని కొందరు అసంతృప్తి వ్యక్తం చేయగా అధికారులు మాత్రి ప్రొటోకాల్ ప్రకారం మాత్రమే పేర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రొటోకాల్ ప్రకారమైతే శిలాఫలకంలో మండల కో ఆప్షన్ సభ్యురాలు సబిరా, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ అమీర్‌బాషా పేర్లు ఆహ్వాన పత్రికలో లేకపోవడంపై మైనార్టీ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి సిబ్బందితో బ్రిడ్జి వద్దకు చేరుకుని అందర్నీ పంపించి వేశారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికునితో మాట్లాడుతున్న వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి

పశ్చిమబెంగాల్ నుంచి తాడపత్రి ప్రాంతానికి అరటి గెలల కోత కోసం వచ్చి రోడ్డు ప్రమాదానికి గురైన కూలీలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి కోరారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి అనంతపురం సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతున్న పశ్చిమ బెంగాల్ కార్మికులను శుక్రవారం నాడు ఆయన పరామర్శించారు. వారి పరిస్థితిపై వైద్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ రాష్ట్రం మాల్దా జిల్లాకు సంబంధించిన వ్యవసాయ కార్మికులు పొట్టకూటి కోసం అరటి గెలలు కోత కూలి పనులకు వచ్చారన్నారు. వేములపాడు తాడపత్రి టోల్‌ప్లాజా మార్గంలో వారు ప్రయాణిస్తున్న బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తా పడిందన్నారు. ఈ ప్రమాదంలో 17 మంది కూలీలు గాయపడ్డారని, అందులో 7 మందికి తీవ్ర గాయాలు అయ్యాయన్నారు. వీరందరికీ మెరుగైన వైద్యం అందించేలా అధికారులు, వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని కోరారు.

చలో విజయవాడతో సత్తా చూపుతాం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వైఖరి అవలంభిస్తున్న ప్రభుత్వానికి ఈ నెల 27న చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమం ద్వారా సత్తా చూపుతామని ఎపిటిఎఫ్ నాయకులు తెలిపారు. ఎపిటిఎఫ్ అనంతపురం జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం శుక్రవారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించి, చలో విజయవాడ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. చర్చల పేరుతో కాలయాపన చేస్తోంది తప్పా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ప్రభుత్వం వాస్తవాలను గుర్తించి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాకుంటే ఈ నెల 27వ తేదీన చలో విజయవాడను ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లతో పెద్దఎత్తున నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్, జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్ బి.వెంకటేషులు, ఉపాధ్యక్షులు దేశాయి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు దుస్థితిపై సిపిఎం నిరసన

ప్రజాశక్తి-పుట్లూరు

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

పుట్లూరు నుంచి తాడిపత్రి వెళ్లే ప్రధాన రహదారి మరమ్మతులు చేపట్టాలని కోరుతూ శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి ఎస్.సూరి మాట్లాడుతూ ఈ మార్గంలో అధిక లోడుతో వెళ్తున్న టిప్పర్ల వల్ల రోడ్డుపై గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే పలువురు కిందపడి తీవ్రంగా గాయపడ్డారన్నారు. ఇకనైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని, లేనిచో ఈ మార్గంలో గ్రామాల ప్రజలతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు జి.వెంకటచౌదరి, టి.పెద్దయ్య, భాస్కర్‌రెడ్డి, నాగభూషణం, కుళ్లాయప్ప, బాబయ్య, వెంకటనాయుడు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

కేంద్రమే రైతు శుభకరణ్ సింగ్‌ను చంపింది..!

◆ ఘటనకు కారకులను కఠినంగా శిక్షించాలి ◆ సిఐటియు, ఎఐటియుసి నేతలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న సిఐటియు, ఎఐటియుసి, రైతుసంఘాల నాయకులు

రైతుల సమస్యల పరిష్కారం కోసం ఢిల్లీలో రైతు సంఘాలు చేపట్టిన ఉద్యమంలో యువరైతు శుభకరణ్ సింగ్ పోలీసుల కాల్పుల్లో మరణించాడని, ఇది ముమ్మాటికీ కేంద్ర ప్రభుత్వ హత్యగా భావిస్తున్నట్లు సిఐటియు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎస్.నాగేంద్రకుమార్, వై.రాజారెడ్డిలు తెలిపారు. రైతు శుభకరణ్‌సింగ్ మృతికి కారుకులైన వారిని శిక్షించాలని, ఎంఎస్.సామినాథన్ సిఫార్సులు అమలు, రైతులకు కనీస మద్దతు ధర కల్పించాలని కోరుతూ వామపక్ష రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నాడు నిరసన తెలిపారు. రైతు, కార్మిక జెండాలు, ప్లకార్డులు చేతబట్టుకుని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నాగమణి, ఎస్.నాగేంద్రకుమార్, ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజేష్ గౌడ్, రాజారెడ్డి, ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఢిల్లీ రైతు ఉద్యమంపై బిజెపి ప్రభుత్వ ధమనకాండ సాగిస్తూ రైతును బలి తీసుకుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నిరంకుశత్వ విధానాలను నిరసిస్తూ కార్మిక, రైతుసంఘాలు ఢిల్లీ హర్యానా సరిహద్దులో రైతు ఉద్యమం సందర్భంగా గతంలో రైతులకు ఇకిచ్చిన హామీలను అమలు చేయడంలో బిజెపి ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. అందుకు నిరసనగా రెండో విడత రైతాంగం శాంతియుతంగా రైతు సమస్యలను ప్రభుత్వం దష్టికి తెచ్చేందుకు ఢిల్లీకి వెళ్తేంటే బిజెపి ప్రభుత్వం రైతులపై అత్యంత కర్కశంగా పోలీసుల చేత కాల్పులు జరిపించిందన్నారు. ఈ కాల్పుల్లో యువ రైతు శుభ కరణ్ సింగ్ మరణించాడం అత్యంత బాధాకరం అన్నారు. హామీలు అమలు చేయకుండా నిరంకుశత్వంగా వ్యవహరిస్తున్న మోదీ ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ బ్లాక్‌డేగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు రైతులు పండించే అన్ని పంటలకు డాక్టర్ ఎంఎస్.స్వామి నాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు మద్దతు ధరలు ప్రకటించాలన్నారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన విద్యుత్ బిల్లు 2020ను ఉపసహరించుకోవాలన్నారు. గత రైతు ఉద్యమంలో మృతి చెందిన అమరవీరుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. రైతు ఉద్యమంలో రైతు నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. యువ రైతు కరణ్ సింగ్ కుటుంబాన్ని అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకుని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి వెంకట నారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, జిల్లా అధ్యక్షులు ఎటిఎం.నాగరాజు, సిఐటియు నాయకులు ప్రకాష్, ఆదినారాయణ, సురేంద్ర, ఆజాం బాషా, మంత్రి వరలక్ష్మి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు బి.చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

ఓటర్ల దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని పరిష్కరిస్తున్నట్లు కలెక్టర్ ఎం.గౌతమి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి తెలియజేశారు. విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి శుక్రవారం నాడు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర చీఫ్ ఎలక్టరోల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫామ్- 6,7,8 దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఫామ్- 6, 8 క్లెయిమ్స్ కి సంబంధించి నిర్ణీత గడువులో ఉన్నాయని, గడవు దాటిన తర్వాత వాటిని పరిష్కరిస్తామన్నారు. ఫామ్- 7 దరఖాస్తుల పరిష్కారానికి అనుమతి కోసం సీఈవోకు పంపామన్నారు. జిల్లాలో అన్ని పోలింగ్ స్టేషన్లలో అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతపురం నగరంలోని జేఎన్టీయూలో కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేయనున్నామని, ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు అందించిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో వి.శ్రీనివాసులు రెడ్డి, ఈఆర్ఒ శిరీషా, డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్, సిపిఒ అశోక్ కుమార్ రెడ్డి, డిఐఒ రవిశంకర్, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సూపరింటెండెంట్ రవికుమార్, ఎలక్షన్ సెల్ సీనియర్ అసిస్టెంట్ శ్యాముల్, తహశీల్దార్లు పాల్గొన్నారు.

ముస్లిములకు అర్బన్ టికెట్ ఇవ్వండి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వచే సార్వత్రిక ఎన్నికల్లో ముస్లిం, మైనార్టీలు అత్యధికంగా ఉన్న ప్రాంతాల్లో మైనార్టీలకే పార్టీ టికెట్లు కేటాయించాలని ముస్లిం, మైనార్టీ సంఘాలు, నూర్ బాషా దూదేకుల సంఘాల నాయకులు ప్రధాన పార్టీలను డిమాండ్ చేశారు. అనంతపురం నగరంలోని నూర్ బాషా, దూదేకుల భవన్‌లో ముస్లిం మైనార్టీలు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలను మైనార్టీ సంఘాల నాయకులు మీడియా సమావేశంలో మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఒక ఎంపీతో పాటు రెండు ఎమ్మెల్యే స్థానాలను మైనార్టీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అందులోనూ అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 70వేల మందికి పైగా ముస్లిం ఓటర్లు ఉన్నారని, ఇక్కడ ముస్లిములకే టికెట్ ఇవ్వాలన్నారు. ఏ పార్టీ ముస్లిం మైనార్టీలకు రెండు ఎమ్మెల్యే, ఒక ఎంపీ సీటు కేటాయిస్తారో వారికే తమ సంపూర్ణ మద్దతు తెలుపతామని పేర్కొన్నారు.

ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధులు వాలంటీర్లు

మహిళా సాధికారతకు సిఎం జగన్ కృషి : 'వాలంటీర్లకు వందనం', 'వైఎస్ఆర్ ఆసరా' చెక్కుల పంపిణీలో వైసిపి ఎమ్మెల్యేలు

'వాలంటీర్లకు వందనం'లో పాల్గొన్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడి, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు

ప్రజాశక్తి -అనంతపురం

ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వాలంటీర్లు వారధులు అని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని తపోవనంలో ఉన్న వివిఆర్ ఫంక్షన్ హాలులో శుక్రవారం 'వాలంటీర్లకు వందనం' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఉత్తమ వాలంటీర్లకు సేవా వజ్ర, సేవారత్న, సేవా మిత్ర, అవార్డులు ప్రదానం చేశారు. ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ ఈ ప్రభుత్వానికి గొంతుక, సైన్యం వాలంటీర్లే అన్నారు. పేదలకు మంచి జరగాలన్న ఏకైక లక్ష్యంతో నిస్వార్థంగా సేవలు చేస్తున్నారని కొనియాడారు. చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీలు దోపిడీ చేస్తే జగన్ హయాంలో సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే సుపరిపాలన తెచ్చామని స్పష్టం చేశారు. ప్రజలకు సేవలు అందిస్తున్న వాలంటీర్లపై టిడిపి, జనసేన పార్టీ అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. సార్వత్రిక ఎన్నికలకు కార్యోన్ముఖులు అవుదామని, ప్రతిపక్షాల దుర్మార్గాలను సమిష్టిగా ఎదుర్కొం దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయ భాస్కర్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు లీలావతి, రాజేశ్వరి, శేఖర్‌బాబు, చంద్రలేఖ, ఎంపిపి వరలక్ష్మి, సర్పంచులు ఉదయ్, ఆశాబీ, ఉప సర్పంచి సుమిత్ర పాల్గొన్నారు.

వాలంటీర్ల సేవలు అమోఘం : ఎమ్మెల్యే వైవిఆర్

పామిడి : సిఎం జగన్ వినూత్నంగా ప్రవేశ పెట్టిన వాలంటీర్ల సేవలు అమోఘమని ఎమ్మెల్యే వై.వెంకట రామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించిన 'వాలంటీర్లకు వందనం' కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేతో పాటు జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా వాలంటీర్లు అందిస్తున్న సేవలు అమోఘం అన్నారు. వాలంటీర్ల ఉద్యోగం ఎంతో బాధ్యతగలది అని, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నారన్నారు. లంచానికి ఆస్కారం లేకుండా వాలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారులకే సంక్షేమ పథకాలను అందించిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రజలు మరోమారు వైసిపిని ఆదరించాలని కోరారు. ఐదుగురు వాలంటీర్లకు ఎమ్మెల్యే ప్రత్యేకంగా రూ. 5వేల చొప్పున నగదు అందజేశారు. అనంతరం సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులు అందుకున్న ప్రతి ఒక్కరినీ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసరావు, ఎంపిపి మురళీమోహన్‌రెడ్డి, జడ్పీటిసి శోభమధుసూదన్‌రెడ్డి, వైస్ ఎంపిపిలు, సచివాలయ పట్టణ, మండల కన్వీనర్లు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

వాలంటీర్‌కు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే వైవిఆర్

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ఎన్నికల హామీలు 99 శాతం అమలు : ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు : గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరులో కనకదాసు కల్యాణ మండపం ఆవరణలో ఎంపిడిఒ దశరథరామయ్య అధ్యక్షతన 'వలంటీర్లకు వందనం కార్యక్రమం' నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం జగన్ వాలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి గ్రామాల్లోని ప్రజలకు అండగా నిలిచారన్నారు. సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు నేరుగా వారి ఇంటి వద్దకే చేరవేయడంలో వాలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిస్వార్థంగా లబ్ధిదారుల చెంతకు చేర్చుతున్న వాలంటీర్ల సేవలు ప్రశంసనీయమన్నారు. వాలంటీర్ల సేవల వల్ల ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ప్రతిపక్ష పార్టీలు బెంబేలెత్తుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపిపి హేమలత, వైస్ ఎంపిపి దిబ్బ చంద్రశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ లక్ష్మీనరసింహ, యూత్ మండల కన్వీనర్ కొండారెడ్డి, వాసుదేవరెడ్డి, నాగరాజు, వన్నూరప్ప, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు వాలంటీర్లు పాల్గొన్నారు.

సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

మహిళలకు 'ఆసరా' ఓ వరం : ఎమ్మెల్యే పెద్దారెడ్డి

పెద్దవడుగూరు : మహిళా సాధికారతే సిఎం జగన్ లక్ష్యమని, 'వైఎస్ఆర్ ఆసరా' మహిళలకు ఓ వరమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. పెద్దవడుగూరులో శుక్రవారం నిర్వహించిన వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని డ్వాక్రా మహిళల అభ్యున్న తికి సిఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. అందుకు తావు లేకుండా పారదర్శక పాలన అందిస్తున్నా న్నారు. కార్యక్రమంలో తాడిపత్రి మార్కెట్ యార్డ్ చైర్మన్ కొట్టాలపల్లి హరినాథ్‌రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గూడూరు సూర్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ శశిధర్‌రెడ్డి, జెడ్పిటిసి భాస్కర్‌రెడ్డి, ఎంపిపి శ్రీదేవి, సర్పంచి వరలక్ష్మి, నాయకులు శేషానందరెడ్డి, వెంకటస్వామిగౌడ్, ప్రకాష్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, పాశం రంగస్వామియాదవ్, కృష్ణారెడ్డి, వేణుగోపాల్ యాదవ్, సత్యంరెడ్డి, రామాంజులురెడ్డి, రామన్న, మహిళా సంఘాల సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక పరిపుష్టికి 'ఆసరా' : సాంబశివారెడ్డి

పుట్లూరు : 'వైఎస్ఆర్ ఆసరా' పథకం మహిళల ఆర్థిక పరిపుష్టికి ఆసరాగా నిలుస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు సాంబ శివారెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త ఎం.వీరాంజనేయులు పేర్కొన్నారు. యల్లనూరు గ్రామ సచివాలయం-2 వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపి ణీ కార్యక్రమంలో వారితో పాటు పార్లమెంటు సమన్వయకర్త శంకరనారాయణ, పైలా నరసింహయ్య పాల్గొన్నారు. వారు ముందుగా మండలంలో ఆసరా ద్వారా రూ. 5.99 కోట్లను మహిళల ఖాతాల్లో జమ చేశారు. అందుకు సంబంధించి మెగా చెక్కును సభ్యులకు అందజేశారు. వారు మాట్లాడు తూ టిడిపి పాలనలో జన్మభూమి కమిటీలు సూచించిన వారికే ప్రభుత్వ పథకాలు అందేవన్నారు. జగన్ పాలనలో కుల, మతాలు, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఇలాంటి సంక్షేమ పాలన మళ్లీ రావాలి అంటే మరోమారు వైసిపిని గెలిపించాలని కోరారు. అనంతరం సిఎం జగన్, వైఎస్ఆర్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు.

గ్రామ సచివాలయం-2 పరిధిలో ఏర్పాటు చేసిన వాలంటీర్ల సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సాంబ శివారెడ్డి, వీరాంజనేయులు, పైలా నరసింహయ్య హాజరయ్యారు. వాలంటీర్లు డి.కౌసల్య, డి.సువర్ణలకు సేవా వజ్ర, కె.శాంతి, సుబ్బన్న గారి పెద్దిరాజు, ఆర్.రామనాథ రెడ్డి, ఎస్. విజయ్‌కుమార్, టి.రాజశేఖర్‌లకు సేవారత్న, 197 మందిని సేవామిత్ర పురస్కారాలు అందజేసి, శాలువాతో సత్కరించారు. వారు మాట్లాడుతూ వాలంటీర్ల సేవలు అనిర్వచనీయమన్నారు. సిఎం జగన్ చేసిన మేలుని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని వాలంటీర్లకు సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధు లు, అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

'వైఎస్ఆర్ ఆసరా'చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విద్యా సలహాదారు సాంబశివారెడ్డి

నేరాలు ఘోరాలు

పశుగ్రాసం అగ్నికి ఆహుతి

అగ్నికి ఆహుతవుతున్న గడ్డివాములు

డి.హీరేహాల్ : మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో 9 గడ్డి వాములు కాలి బూడిదైనట్లు సర్పంచి పరమేశ్వరప్ప తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాములకు నిప్పు పెట్టడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుందని తద్వారా రూ. 5 లక్షల వరకూ నష్టపోయామని బాధితులు ఆంజనేయ, బుడ్డప్ప, వండరప్ప, ఎర్రిస్వామి, పూజారి సిద్ధప్ప వాపోయారు. బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవడంతో పాటు, ఈ దారుణానికి వడిగట్టిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ అధికారులు, పోలీసులను కోరారు.

25న కదిరిలో బంజారాల సింహగర్జన

శింగనమల : ఈ నెల 25వ తేదీ కదిరి పట్టణంలో నిర్వహిస్తున్న బంజారాల సింహగర్జనను విజయవంతం చేయాలని ఎబిఎస్ఎస్ డాక్టర్ ఫోరం సభ్యుడు డాక్టర్ రమణనాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం శింగనమలలో రాష్ట్ర కార్యదర్శి చక్రినాయక్, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు నాయక్, కార్యదర్శి కాలునాయక్, వైద్యులు రామస్వామినాయక్, ఆనంద్ నాయక్, శివశంకర్‌నాయక్, లోకేష్‌నాయక్, రాకేష్‌తో కలిసి ఆయన సింహగర్జన కరపత్రాలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ బంజారాల రాజకీయ, ఆర్థిక, సామాజిక, న్యాయ సాధన కోసం నిర్వహిస్తున్న బహిరంగ సభకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బంజారాలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

28న గుత్తిలో ఎంఆర్‌పిఎస్ సమీక్ష సమావేశం

శింగనమల/పెద్దపప్పూరు/రాయదుర్గం : గుత్తి పట్టణంలోని సితార ఫంక్షన్ హాలులో ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ నిర్వహిస్తున్న ఉమ్మడి అనంతపురం జిల్లా సమీక్షా సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంఆర్ పిఎస్ జిల్లా అధ్యక్షులు హరిగోపాల్, కార్యదర్శి చిన్న జలాలపురం ఓబులేసు, వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఆదినారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం శింగనమల, రాయదుర్గంలో కరపత్రాలు విడుదల చేశారు.

ఇష్టపడి చదివి ఒత్తిడిని జయించండి : ఎస్ఐ

నార్పల : పదో తరగతి విద్యార్థులు ఇష్టపడి చదివి, మానసిక ఒత్తిడిని జయించి మంచి ఫలితాలు సాధించాలని ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి సూచించారు. చెన్నకేశవ అనాథ ఆశ్రమం అందజేసిన పరీక్ష కిట్లను శుక్రవారం ఎస్ మండలంలోని కేసేపల్లి జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు స్రవంతి చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా జకినీమాత ఉత్సవాలు

గుత్తి : ఆరెకటికల ఆరాధ్య దేవతలు సునామ జకినీమాతా, మల్కామ జకినీమాతా దేవతల ఉత్సవాలు గుత్తిలో శుక్రవారం వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూ రుబి, మాజీ ఎమ్మెల్యేలు ఆర్.జితేంద్రగౌడ్, ప్రభాకర్ చౌదరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించా రు. అతిథులను అఖిల భారత ఆరెకటికల సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో సత్క రించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా నాయకులు క్రషర్ మధుసూదన్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్ పీరా, వై.రామసుబ్బారెడ్డి, డి.షఫీ, కౌన్సిలర్ వరదరాజులు, టిడిపి నాయకులు ఆర్.పవన్‌గౌడ్, ఆర్.ధర్మతేజగౌడ్ పాల్గొన్నారు.

చర్మకారులకు పింఛను రూ. 5వేలు ఇవ్వాలి

గుత్తి : ప్రభుత్వం డప్పు కళాకారులు, చర్మకారులకు పింఛను మొత్తం రూ. 5 వేలకు పెంచాలని ఎపి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంజన్‌ప్రసాద్ కోరారు. పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో శుక్రవారం ఎపి ఎంఆర్‌పిఎస్ కార్యకర్తల సమావేశం జరిగింది. అంజన్‌ప్రసాద్ మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం రాజకీయ రంగంలో మాదిగలకు సమన్యాయం జరగాలన్నారు. ఎపి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు మార్చి 10వ తేదీ తలపెట్టిన మాదిగల సమ్మేళన మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అడవి రాముడు, గౌరవాధ్యక్షులు జి.రామదాసు, నాయకులు కాశీం, శివరాం, కరిడికొండ శివ, శ్రీపురం రామాంజి, చంద్ర, హమాలీ రామంజి, అంజి, ఓబులేసు, హేమంత్ పాల్గొన్నారు.

గేట్స్‌లో విద్యార్థులకు శిక్షణ

సర్టిఫికెట్లతో గేట్స్ విద్యార్థులు

గుత్తి : పట్టణ శివారులోని గేట్స్ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం 'ఫుల్ స్టాక్ అప్లికేషన్ డెవలప్మెంట్ యూజింగ్ నో కోడ్ లో కోడ్' అనే సాంకేతిక అంశంపై స్క్రీన్ నిర్వహించి, విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ముఖ్యఅతిథిగా అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ జయచంద్రరెడ్డి హాజరై మాట్లాడారు. సాంకేతిక రంగంలో ఫుల్ స్టాక్ డెవలప్మెంట్ మైలు రాయిగా నిలుస్తోందన్నారు. డెవలపర్లు ఫ్రంట్ ఎండ్, బ్యాక్ అండ్ ఇంజినీరింగ్‌కు వారధిగా నిలుస్తారన్నారు. అనంతరం 'హకథన్' విజేత విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశా రు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వికె.పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, ప్రిన్సిపల్ డాక్టర్ సురయ, ఒఎ ఇంతియాజ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'స్టీల్ ప్లాంట్' సాధనకు యువత నడుం బిగించాలి

స్టీల్ ప్లాంట్ సాధన కమిటీ అధ్యక్షులు నాదల్

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం ప్రాంతంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కోసం యువత నడుం బిగించాలని స్టీల్ ప్లాంట్ సాధన కమిటీ అధ్యక్షులు బిఎం నాదల్ పిలుపునిచ్చారు. రాయదుర్గం ను స్టీల్ ప్లాంట్ హబ్‌గా మార్చి యువతకు జీవనోపాధి కల్పించేందుకై స్టీల్ ప్లాంట్ ఉద్యమం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. రాయదుర్గం అత్యంత వెనుకబడిన ప్రాంతం కావడంతో ప్రజలు పట్టణాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే సాగు నీటి సౌకర్యం కల్పించాలి లేదా పరిశ్రమలు స్థాపించాలన్నారు. డి.హీరేహాల్ మండలంలోని ఓబులాపురం వద్ద ఇనుప ఖనిజం లభిస్తుందని, పరిశ్రమలు పెట్టడానికి అనువుగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో అప్పటి సిఎం కిరణ్ కుమార్ రెడ్డి కుదిరేముఖ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు వైజాగ్ స్టీల్ ప్లాంట్ పారిశ్రా మిక వేత్తలతో ఒప్పందం కుదుర్చు కున్నారని, పాలకులు, ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ఈ ప్రాంతానికి పరిశ్రమ లు రాలేదన్నా రు. భవిష్యత్తులో రాయదుర్గం అభివృద్ధి చెందాలంటే ముఖ్యంగా స్టీల్ ప్లాంట్ పరిశ్రమ ఏర్పాటు చేసే దిశగా పాలకులు, ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యం లోనైనా రాజకీయ పార్టీలు స్టీల్ ప్లాంట్ ఏర్పాటుపై స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

టిడిపి ఆధ్వర్యంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజలతో మాట్లాడుతున్న జెసి అస్మిత్‌రెడ్డి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

టిడిపితోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూర్చుతుందని నియోజకవర్గ సమన్వకర్త జెసి అస్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ'లో భాగంగా శుక్రవారం ఆయన పెద్దవడుగూరులోని ఆర్జీటీ, ఎస్సీ, కోట కాలనీల్లో పర్యటించి సూపర్‌సిక్స్, మినీమేనిఫెస్టో పథకాలను ప్రజలకు వివరించారు. ఐదేళ్లలో వైసిపి అరాచక పాలన, ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు విసుగు చెందారని, రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధం అయ్యారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, నాయకులు ఆవులంపల్లి కేశవరెడ్డి, గంగరాజు, హరినాథరెడ్డి, నారాయణ స్వామి, చిరంజీవులు, ముత్యాలు, నాగరాజు, ప్రసాద్‌యాదవ్, వెంకటేసు పాల్గొన్నారు.

పామిడి : మండలంలోని జి.కొట్టాల గ్రామంలో శుక్రవారం అనంతపురం పార్లమెంట్ డాక్టర్ సెల్ అధ్యక్షురాలు డాక్టర్ పత్తి హిమబిందు ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఆమె టిడిపి శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్, మినీమేనిఫెస్టో పథకాలను ప్రజలకు వివరించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రాబోయే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి ప్రతాప్ రామయ్య, నూర్, చాగంటి గోవిందరాజులు, చిన్న తిరుపాల్, సూర్యనారాయణ, నాగరాజు, నాగేష్, రామాంజనేయులు, దేవరపల్లి బాజీ, నారాయణ, కదిరప్ప, మనోహర్, రాధా, జానకి, అరుణ, మాధవి, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి కుటుంబ సాధికార సారథుల సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు

ప్రజాశక్తి-ఆత్మకూరు

స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పి.యాలేరు, వై.కొత్తపల్లి గ్రామా ల్లోని పోలింగ్ బూత్‌లకు సంబంధించి కుటుంబ సాధికార సారథుల సమావే శం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి కేటాయించిన ఓటర్లను గుర్తించడం, సూపర్ సిక్స్, మినీమేని ఫెస్టోలోని పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే అంశాలపై వివరించారు. సమావేశంలో నాయకులు బి.వెంకటనారాయణ, రవితేజరెడ్డి, శ్రీనివాసులు, బి.శ్రీనివాసులు, చెన్నప్ప, నాగేంద్ర, మురళి, బొమ్మయ్య, రవిశంకర్, రాజారమేష్, నాగన్న, మలరాయుడు, సూర్యనారా యణ, వెంకటేష్, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో అవకతవకలపై టిడిపి ఫిర్యాదు

ఓటరు జాబితాలో అవకతవకలపై సమగ్ర విచారణ చేయాలని కోరుతూ టిడిపి మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎఇఆర్‌ఒకి ఫిర్యాదు చేశారు. వినతి ఇచ్చిన వారిలో నాయకులు వెంకటనారాయణ, గుజ్జుల వెంకటేష్, అంకె ఆనంద్, రాజారమేష్, బొమ్మయ్య, రవితేజరెడ్డి, మురళి పాల్గొన్నారు.

సత్యనారాయణరెడ్డికి ముస్లిముల ఆత్మీయ సన్మానం

సత్యనారాయణరెడ్డిని సన్మానిస్తున్న ముస్లిములు

ప్రజాశక్తి-నార్పల

మండలంలోని ముస్లింలకు అందుబాటులో ఉంటూ వారి అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని సత్య నారాయణరెడ్డి తెలిపారు. స్థానిక ఈద్గా మసీదులో శుక్రవారం నమాజ్ అనంతరం సత్యనారాయణరెడ్డిని ముస్లిములు సన్మానిం చారు. వారు మాట్లాడుతూ ఈద్గా మసీదు ఆవరణలో బోర్ వేయించడంతో పాటు మసీదు, షాదిఖానా పరిసరాల్లో సీసీ ప్లాట్ ఫాం ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించారని కొనియాడారు. పురాతన జామియా మసీదు(పెద్ద మసీదు) అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ, మేజర్ పంచాయతీ సర్పంచి మన్నిల సుప్రియ, ఉప సర్పంచి శ్రీరాములు, ఖాజీ ఫయాజ్ బాషా, ముతవల్లి శంషుద్దీన్, ఇక్బాల్‌బాషా, షేక్షావలి, ఖాదర్‌వలిఖాన్, మార్కెట్ డైరెక్టర్ డైరెక్టర్ అమీర్‌బాషా, దాడితోట బాషా, జిలాన్‌బాషా, అబ్దుల్ కరీం, సయ్యద్ బాషా, దాదాపీర్, మోదిన్ నౌషాద్, ఇంతియాజ్, జాకీర్, ఖాసీం, నబిరసూల్, వైసిపి నాయకులు శివయ్య, బలనాగి, బయన్న, గోపాల్, మోహన్ పాల్గొన్నారు.

వైభవంగా నారసింహుని కళ్యాణం

సామూహిక వివాహాల్లో పాల్గొన్న జంటలు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

మండలంలోని మల్లాపురం సమీపంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ గౌరవాధ్య క్షులు రామ్మూర్తి స్వామీజీ ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ, నిత్యారాధన, దీక్ష హోమం నిర్వహించారు. 18వ దీక్ష మాలధారణలో భాగంగా 42 మంది మాల ధరించారు. ఉచిత సామూహిక వివాహాల్లో భాగంగా 8 జంటలు ఒక్కటయ్యాయి. పట్టణానికి చెందిన పేర్మీ కిరీటప్ప, దండే విశ్వరాజు, సత్యనారాయణ, వెంకటేశులు సురేష్ గార్మెంట్స్ కుటుంబ సభ్యులు మంగళ సూత్రాలు అందజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు తిప్పేస్వామి, ఉపాధ్యక్షులు ధర్మన్న, కోశాధికారి నరసింహులు, ఉప కోశాధికారి సత్యనారాయణ, కార్యదర్శి గురు రాఘవేంద్ర ప్రసాద్, అకౌంటెంట్ వెంకటేశులు, కమిటీ సభ్యులు తిప్పేస్వామి, గురునాథరెడ్డి, కమలాక్షుడు, రామిరెడ్డి, వెంకటరెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

25న ప్రయివేట్ టీచర్లకు శిక్షణ

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జిల్లా ప్రయివేటు పాఠశాలల యాజమాన్య సంఘం(అపుస్మా) ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ నగరంలోని శ్రీ 7 కన్వెన్షన్ హాలులో ఉమ్మడి జిల్లాలోని ప్రయివేటు పాఠశాలల ప్రీ ప్రైమరీ, ప్రైమరీ టీచర్లకు ఎన్రిచ్‌మెంట్ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు పుల్లారెడ్డి తెలిపారు. నగరంలోని కమలానగర్‌లో ఉన్న అపుస్మా కార్యాలయంలో శుక్రవారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. పుల్లారెడ్డి మాట్లాడుతూ విశాఖపట్నంకు చెందిన రామునాయుడు, వాణిశ్రీ పలు అంశా లపై శిక్షణ ఇస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా 1200 మంది పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో స్టేట్ వైస్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి, స్టేట్ చీఫ్ కోఆర్డినేటర్ శ్రీరామిరెడ్డి, స్టేట్ అడ్వైజర్ నాగపీరయ్య, స్టేట్ కన్వీనర్ నాగరాజు, గౌరవా ధ్యక్షుడు నాయుడు, సంజీవరెడ్డి, సూర్య నారాయణరెడ్డి, తేజేశ్వర్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, అన్వర్ పాల్గొన్నారు.

సమావేశమైన అపుస్మా నాయకులు

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

గుత్తి : వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జిల్లా అదనపు మలేరియా అధికారి వినయ్‌కుమార్ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు జంగాల కాలనీలో శుక్రవారం ఫ్రై డే-డ్రైడే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. కాలనీలోని ఇళ్ల వద్దకు వెళ్లి పరిసరాలను పరిశీలించారు. దోమల ద్వారా వచ్చే వ్యాధుల గురించి ప్రజలకు తెలిపారు. డెంగ్యూ, మలేరియా, మెదడువాపు, తదితర వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయన వెంట ఎఎన్ఎం భార్గవరాణి, శానిటేషన్ కార్యదర్శి మల్లికార్జున, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు ఉన్నారు.

న్యాయం చేయాలని ఎస్పీకి వినతి

ఆత్మకూరు : గత ఆదివారం వికలాంగుడు గొల్ల అక్కులన్నపై ఓ పోలీస్ కానిస్టేబుల్ దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని, దీంతో శుక్రవారం అనంతపురం వెళ్లి జిల్లా ఎస్పీ అన్బురాజన్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. సమస్యను విన్న ఎస్పీ ఈ ఘటనపై విచారణ జరిపించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపాడు. ఆయనతో పాటు గంగన్న, రాజశేఖర్, రామాంజనేయులు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

గార్లదిన్నె : స్థానిక ఆదర్శ పాఠశాలలో శుక్రవారం మండల వైద్యాధికారిణి గౌతమి ఆధ్వర్యంలో లింగ వివక్ష నిర్మూలన, బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిహెచ్ఒ లోకనాథ్ మాట్లాడుతూ లింగ నిర్ధారణ నేరమని, అతిక్రమిస్తే జైలు శిక్ష తప్పదన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య, పిహెచ్ఎన్ అరుణ, ఎఎన్ఎం సావిత్రి, కుమారి, ఉపాధ్యాయులు, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల ఇళ్ల వద్దకే మెరుగైన వైద్య సేవలు

ఉరవకొండ : ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడమే ధ్యేయంగా జగన్ ప్రభుత్వం ఇంటి వద్దకే మెరుగైన వైద్య సేవలు అందిస్తుందని విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని వేల్పుమడుగు గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఎంపిపి మాట్లా డుతూ శిబిరంలో నిపుణులైన వైద్యులు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తారన్నారు. ప్రజల సంక్షేమంతో పాటు ఆరోగ్య భద్రత కల్పిస్తున్న వైసిపిని మరోమారు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఇఒఆర్‌డి సత్యబాబు, వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, వైద్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్లు

పెన్నహోబిలేశుని సన్నిధిలో తెలంగాణ మాజీ సిఎస్

స్వామిని దర్శించుకున్న సోమేశ్‌కుమార్ దంపతులు

ఉరవకొండ : జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెన్నహోబిలంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామిని శుక్రవారం తెలంగాణ మాజీ చీఫ్ సెక్రటరీ సోమేశ్‌కుమార్ దంపతులు దర్శించుకున్నారు. వీరికి ముందుగా ఆలయ మర్యాదల ప్రకారం మేళ తాళాలతో స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్, అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు బొలికొండ రంగనాథస్వామి రథోత్సవం

గుత్తి : మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవం నిర్వహిస్తున్న ట్లు ఉత్సవ ప్రత్యేకాధికారి డి.పాండురంగా రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి వి.దేవదాసు తెలిపారు. వేకువజామున శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథ స్వామి కల్యాణం, సాయంత్రం ప్రత్యేకంగా అలంకరిం చిన రథంలో ఉత్సవ మూర్తుల ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయన్నారు. పెద్దవడుగూరు మండలం కిష్టిపాడుకు చెందిన భక్తుడు పి.కొండయ్య చౌదరి స్వామి చిత్రాలతో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

భక్తుల సేవే పరమావధి

భక్తుల సేవే పరమావధిగా పని చేస్తున్నామని మాణిక్య రంగనాథ స్వామి దేవస్థాన అభివద్ధి కమిటీ, ఆలయ ధర్మకర్త మాకం శ్రీకాంత్, అధ్యక్షులు జివి.రామన్, ప్రధాన కార్యదర్శి జయవరం అశ్వర్థ రంగయ్య తెలిపారు. వారు శ్రీరంగ కళ్యాణ నిలయంలోని కమిటీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు ముత్యాల బాలమోహన్, చల్లా కృష్ణ రంగయ్య, కోశాధికారి ముత్యాల వెంకటరంగయ్య, సహాయ కార్యదర్శులు ఎం.నాగరాజయ్య, మంచికంటి రామరంగయ్య, కార్యనిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మంది ప్రజానికానికి మా కక్షిదారుడైన మంగలి విశ్వనాథ S/o మంగలి నారాయణప్ప పెద్ద కౌకుంట్ల గ్రామం, ఉరవకొండ మండలం, అనంతపురం జిల్లా వారి తరుపున తెలియజేడము ఏమనగా మా కక్షిదారుడైన మంగలి విశ్వనాథ గారికి వారి సహోదరులు మరియు వారి తండ్రి నుండి 13/10/1993 వ తేదినా భాగరిష్కార దస్తావేజు డాక్యుమెంటు నెంబరు 1250/1993 ద్వారా పెద్ద కౌకుంట్ల గ్రామ పొలం నందు సర్వే నెంబరు 284లో విస్తీర్ణం య.6.54 సెంట్లు మరియు సర్వే నెంబరు 93 లో విస్తీర్ణం య.2.00 సంక్రమించినది. పైన తెలిపిన రిజిస్టరు ఒరిజినల్ భాగపరిష్కార దస్తావేజు ప్రయాణ సమయంలో ఉరవకొండ బస్టాండ్ నందు పోగొట్టుకుపోయింది. పైన తెలిపిన ఒరిజినల్ భాగపరిష్కార దస్తావేజు ఎవరికైననూ దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సు దారునికి గాని లేక మా కక్షిదారునికి గాని అందజేయగలరని తెలియజేయడమైనది.

ఎ.రామమోహన్, M.A.B.L.,
అడ్వకేట్, ఉరవకొండ, సెల్:8106371019

GUNTAKAL MUNICIPALITY
e procurement Tender Notice

S.No	e-Tender Notification No	No of works	Estimate Cost in lakhs
1	54/2023-24/GENERAL FUNDS/E3 dated : 23.02.2024	4	Rs 31.50

Further details can been seen at eprocurement market place i.e., www.tender.apeprocurement.gov.in

Sd/- Commissioner,
Guntakal Municipality.